## క్లుప్తంగా

### దుర్గెమ్మదేవి ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేయిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

**కణేకల్లు:** మండలంలోని జక్కలవడికి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన దుర్గెమ్మదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా ఆలయంలో కలశ పూజ, జయాది హోమం, గణపతి హోమం, నవగ్రహ, దుర్గాదేవి హోమం, షడద్వజ హోమం చేపట్టారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఆలయంలో జరిగిన పూజలు, హోమాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, చత్రాల కుటుంబ సభ్యులు, ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, నాయకులు సోమిరెడ్డి, రఘురామిరెడ్డి, శివరామిరెడ్డి, చత్రాల వెంకట్రామిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, రాజేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సోమిరెడ్డి, గిర్రప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బదిలీ పోలీసులకు సన్మానం

**శెట్టూరు:** స్థానిక పోలీస్ స్టేషనలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన కానిస్టేబుళ్లను ఎస్ఐ యువరాజ్, సిబ్బంది గురువారం సన్మానించారు. పోలీసులు జగదీష్, రాజ్‌కుమార్ బదిలీపై బొమ్మనహల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. వారిని ఎస్ఐతో పాటు తోటి సిబ్బంది శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఎర్రిస్వామి, కానిస్టేబుళ్లు మంజునాథ, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ


కర్నూల్ ఆస్పత్రిలో పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ రామ్మోహన్

**కూడేరు:** మండలంలోని చోళసముద్రానికి చెందిన శ్యామలమ్మ అనే వృద్ధురాలు వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారురాలు. అనారోగ్య సమస్యతో గత కొద్ది రోజులుగా కర్నూలులోని ఆస్పత్రిలో ఉంటూ చికిత్స పొందుతోంది. ఆమె ఇంటి దగ్గర అందుబాటులో లేదని తెలియడంతో వలంటీర్ రామ్మోహన్ గురువారం వేకువజామున ఊర్లో పింఛన్ నగదు పంపిణీ చేశాడు. అనంతరం కర్నూలుకు వెళ్లి శ్యామలకు నగదును అందజేశారు. పింఛన్ నగదు అందడంతో వైద్య ఖర్చులకు ఉపయోగపడుతాయని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఉపాధి పనుల వద్ద..


వెంకటాంపల్లిపెద్దతండాలో పింఛన్ అందచేస్తున్న వలంటీర్ నాగరాజునాయక్

**వజ్రకరూరు:** మండలంలోని వెంకటాంపల్లిపెద్దతండా గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన వలంటీర్ నాగరాజునాయక్ ఉపాధి పనుల వద్దకు వెళ్లి పింఛన్‌దారులకు నగదు అందచేశారు. వలంటీర్ పనితీరుపై పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేశారు. వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు.

### 'సొంత భవనాలు నిర్మించాలి'

**వజ్రకరూరు:** అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మొలక బాలరామాంజనేయులు కోరారు.గురువారం మండలానికి విచ్చేసిన ఐసీడీఎస్ పీడీ శ్రీదేవిని కలసి వినతి పత్రం అందజేశారు.

### చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


రాగులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మారుతి

**రాయదుర్గం:** చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తహసీల్దార్ మారుతి సూచించారు. ఈ నెల 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా ప్రతి కార్డుదారుడికీ 2 కిలోల ఉచిత బియ్యం బదులుగా 2 కిలోల రాగులు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గురువారం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఆర్ఐ జీవన్‌తో కలసి కార్డుదారులకు రాగుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టేలా ఎండీఎం సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.

# అభివృద్ధి పథంలో 'రాయదుర్గం'


'నాడు-నేడు' ద్వారా రూపుదిద్దుకున్న గుమ్మఘట్ట మండలంలోని గలగల ప్రాథమికోన్నత పాఠశాల


రాయదుర్గం మండలంలోని ఉదేగోళం గ్రామ సచివాలయం


కణేకల్లు మండలంలోని అంబాపురం గ్రామానికి వేసిన తారురోడ్డు

- డీబీటీ ద్వారా రూ.830 కోట్ల నగదు జమ
- నాన్‌డీబీటీ ద్వారా రూ.380 కోట్లు వ్యయం
- రూ.150 కోట్లతో గ్రామీణ రోడ్లకు మహర్దశ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

**రాయదుర్గం:** జిల్లాలోని కర్ణాటక సరిహద్దునున్న 'రాయదుర్గం'లో ప్రగతి పరుగులు పెడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ఇంటింటా వెలుగులు నింపుతున్నాయి. ఏదో ఓ రూపంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందనడంలో సందేహం లేదు. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లైనా.. నాలుగుతరాల అభివృద్ధి సాధించేలా విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఇంతలా అభివృద్ధి, సంక్షేమం చూడలేదని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా 3,32,853 మంది లబ్ధిదారులకు రూ.830 కోట్లు జమచేయడంతో మహిళలు, రైతులు, విద్యార్థులు, డ్రైవర్లు, కుల వృత్తి దారులు, ఆరోగ్య శ్రీ, ఆరోగ్య బీమా, అర్చక, ఇమామ్ ఇలా అనేక వర్గాల ప్రజలు నేరుగా లబ్ధి పొందారు. మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు, ఊరూర సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ కేంద్రాలు, నాడు-నేడు, జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు, తాగునీటి పథకాలు, జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు నాన్ డీబీటీ ద్వారా మరో రూ.380 కోట్లను ఖర్చుచేశారు లబ్ధిపొందిన వారి వివరాలిలా..

రాయదుర్గం నియోజకవర్గం లోని ఐదు మండలాల్లోనూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.53.78 కోట్లు, అమ్మఒడి ద్వారా రూ.128.53 కోట్లు, అర్చక రూ.2.25 లక్షలు, చేదోడు రూ.26.45 కోట్లు, క్రాప్ ఇన్సూరెన్స్ రూ.336.84 కోట్లు, ఈబీసీ నేస్తం రూ.20.84 లక్షలు, ఇమామ్స్ రూ.75 వేలు, ఇన్‌పుట్ సబ్సిడీ రూ. 129.18 కోట్లు, జగనన్న తోడు రూ.12.62 లక్షలు, జగనన్న వసతి దీవెన రూ. 8.68 కోట్లు, విద్యాదీవెన రూ. 23.96 కోట్లు, కాపు నేస్తం రూ.70.50 లక్షలు, లా నేస్తం రూ.1.20 లక్షలు, నేతన్న నేస్తం రూ.25.34 కోట్లు, పాస్టర్ రూ.2.05 లక్షలు, పెన్షన్స్ రూ. 294.53 కోట్లు, రైతు భరోసా రూ.158.40 కోట్లు, సున్నా వడ్డీ (పంటరుణాలు) రూ.56.53 కోట్లు, సున్నావడ్డీ రూ.16.10 కోట్లు, వాహనమిత్ర రూ.71 లక్షలు, ఆరోగ్య ఆసరా రూ.77.81 లక్షలు, ఆరోగ్యశ్రీ రూ.11.21 కోట్లు, వైఎస్సార్ రైతు బీమా రూ.10.16 కోట్లు, వైఎస్సార్ చేయూత రూ. 63.56 కోట్లు జమయ్యాయి. ఈ పథకాల ద్వారా 3,32,853 మందికి మొత్తం రూ.830 కోట్లు జమకావడం విశేషం.

**రోడ్ల అభివృద్ధి కోసం రూ.150 కోట్లు..**

గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అధ్వాన స్థితికి చేరిన గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. పీఆర్, ఆర్అండ్‌బీ, నగరే పథకం ద్వారా సీసీ, బీటీ, తారు రోడ్ల నిర్మాణాలకు సుమారు రూ.150 కోట్లకు పైగా ఖర్చుచేశారు. గడిచిన ఐదేళ్ల టీడీపీ హయాంలో కంటి తుడుపుగా రోడ్ల కోసమే నిధులు ఖర్చుచేశారు.

**'నాడు-నేడు'తో రూపుదిద్దుకున్న పాఠశాలలు..**

నియోజకవర్గంలో 'నాడు-నేడు' ద్వారా మొదటి దశ కింద 135 పాఠశాలలకు రూ.34.94 కోట్లు ఖర్చుచేసి సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే రెండో విడత ద్వారా మరో 187 పాఠశాలలకు సంబంధించి రూ.78.24 కోట్లతో పనులు చేపడుతున్నారు. బడులు తెరిచే ఈ నెల 12 నాటికి లక్ష్యం పూర్తిచేసేలా ప్రణాళికలు చేపట్టారు. వీటికి తోడు రూ.20 కోట్ల వ్యయంతో జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టారు.

**35 వేల మందికి ఇళ్ల పట్టాలు..**

నియోజకవర్గంలోని సుమారు 35 వేల మంది అక్కచెల్లెమ్మలకు విప్ కాపు రామచంద్రారెడ్డి ఇళ్ల పట్టాలిప్పించి పేదల సొంతింటి కల నెరవేర్చేలా కృషి చేస్తున్నారు. గతంలో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రిగా కాలవ ప్రాతినిధ్యం వహించారు. ఆయన అసమర్థత వల్ల నేడు 35 వేల మందికి పట్టాలిచ్చి ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకోవాల్సి వచ్చిందని విప్ పేర్కొన్నారు. మున్సిపాల్టీ పరిధిలోనూ రూ.23 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

**ప్రజా సంక్షేమానికే పెద్దపీట**



ప్రజా సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి గడిచిన నలభై ఏళ్లలో ఎప్పుడూ జరగలేదు. గత పాలకులు కాగితాల్లో మాత్రమే లెక్కలు చూపి ప్రజలను వంచనకు గురిచేస్తే వారి తలరాత మార్చేలా ఖాతాలకే నేరుగా నగదు చేసి సంక్షేమానికి కృషి చేశాం. పైసా అవినీతికి తావు లేకుండా ఒక్క రాయదుర్గం నియోజకవర్గానికి మాత్రమే డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ.వెయ్యి కోట్లు జమయ్యాయంటే ఈ ప్రభుత్వ పనితీరుపై ప్రజలే అర్థం చేసుకోవాలి. రాయదుర్గం అన్నీ రంగాల్లోనూ అభివృద్ధి పథకంలో దూసుకుపోయేలా కృషి చేస్తున్నామన్నారు. టీడీపీ నాయకుల మాటలు విని మోసపోవద్దని ప్రజలకు హితవు పలికారు. ఈ ఏడాది పాలనలో మరింత అభివృద్ధి కి కృషి చేస్తామన్నారు.

– విప్ కాపు రామచంద్రారెడ్డి

## జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం


మాట్లాడుతున్న శ్రీచరణ్

**కంబదూరు:** సంక్షేమం,అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ సీపీ నేత, మంత్రి ఉషశ్రీచరణ్ భర్త శ్రీచరణ్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని కదిరి దేవరపల్లి, మర్రిమాకులపల్లి, గొల్లపల్లి, పాళ్లూరు, రాంపురం గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలతో శ్రీచరణ్ సమావేశమై మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల కోసం సిద్ధంగా ఉండాలన్నారు. సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లి ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలన్నారు.అలాగే ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలను గట్టిగా తిప్పికొట్టాలని సూచించారు. కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని వారికి అండగా ఉంటామన్నారు. అందరూ ఐక్యంగా సైనికుల్లా కష్టపడి పని చేస్తూ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, పార్టీ మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయ కన్వీనర్ సాకే గంగాధర్, సర్పంచ్‌లు బాపూజీ, చెన్నయ్య, లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ తిమ్మరెడ్డి, ఎంపీటీసీలు మీసేవ కుమార్, ఈరన్న, మారెన్న, నాయకులు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, ఐపార్సుపల్లి వెంకటేశులు, రాఘవేంద్ర, కిష్టప్ప, కాశిరెడ్డి, లోకనాథ్‌రెడ్డి, ఎర్రమల్లేపల్లి ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ చిచ్చు లేపితే సహించం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**బొమ్మనహాళ్:** ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో రాజకీయ చిచ్చు లేపి అరాచకాలను సృష్టిస్తే సహించబోమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్ హెచ్చరించారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో గురువారం సాయంత్రం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గోవిందవాడ గ్రామంలో మూడు రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరుగుతుంటే..ఓర్వలేని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తన అనుచరులను రెచ్చగొట్టి గడప గడప కార్యక్రమంలో అల్లర్లు సృష్టించేలా పథక రచన చేశారన్నారు. ఆ గొడవలను ఎల్లో మీడియాలో ఎడిటింగ్ చేసి చూపిస్తున్నారని మండిపడ్డారు. గొడవలు చేస్తున్న పచ్చ నాయకులను అడ్డుకున్న పోలీస్ కానిస్టేబుల్‌పై లేని పోని ఆరోపణలు చేయడం మాజీ మంత్రి కాలవకు సిగ్గు చేటన్నారు. వచ్చే ఎన్నికల్లో కాపు రామచంద్రారెడ్డిపై గెలవలేనన్న ఉద్దేశంతోనే కుట్రలు తెరలేపాడని వారు మండిపడ్డారు. గ్రామానికి ఏ ప్రభుత్వం హయాంలో ఎక్కువ సంక్షేమ పథకాలు వచ్చాయో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు వన్నూరు స్వామి, తిప్పేస్వామి, శీన, మధు, చంద్ర, యల్లప్ప, జేబీ మల్లికార్జున, సుధాకర్, రాజశేఖర్, ఎర్రిస్వామి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి పెద్దపీట


విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న దృశ్యం

**కంబదూరు:** రైతు సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, సర్పంచ్ పద్మావతమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ సాకే గంగాధర్ అన్నారు. గురువారం వారు రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శి నీలి శంకరప్ప, ఎంపీటీసీ సభ్యులు కుమార్, మల్లేసి, నాయకులు రామస్వామి, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

## దళితవాడకు తప్పిన వరద ముప్పు


చోళసముద్రంలో ఎస్సీ కాలనీ వద్ద వంకలో పూడికను తొలగించిన దృశ్యం

**కూడేరు:** ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి చొరవతో చోళసముద్రం ఎస్సీ కాలనీకి వరద నీటి ముప్పు తప్పింది. వివరాలు ఇలా.. ఎస్సీ కాలనీకి పక్కనే పెద్ద వంక ఉంది. కంపచెట్లు, చెత్తా చెదారంతో పూడిక పేరుకు పోయి వంక మూసుకుపోయింది. గత ఏడాది భారీ వర్షాలకు వంక లో నీరు వెళ్లడానికి వీలు లేక ఎస్సీ కాలనీలోకి ప్రవహించడంతో మోకాళులోతు నీరు ఇళ్లలో చేరింది. కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయాన్ని ఇటీవల కాలనీవాసులు, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు మాజీ ఎమ్మెల్యే విశ్వ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వంకలో పూడిక తీయించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ నారాయణరెడ్డికి ఆదేశించారు. ఎంపీపీ నిధులు రూ.2.5లక్షలతో స్థానిక నేతల సహకారంతో జేసీబీ పెట్టి కంపచెట్లు, పూడికను రెండు రోజుల క్రితం తీయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషిచేయాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

**వజ్రకరూరు:** బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఐసీడీఎస్ పీడీ బి.ఎన్. శ్రీదేవి సూచించారు.గురువారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. అనంతరం బాలికను రక్షిద్దాం -బాలికను చదివిద్దాం అని ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకమ్మ, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, డీసీపీఓ సుబ్రమణ్యం, చాబాల సర్పంచు మల్లెల జగదీష్, యూనిసెఫ్ ప్రతినిధి నాగేంద్ర, వైద్యాధికారి తేజశ్వి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

**కళ్యాణదుర్గం:** పూర్వీకుల నుంచి సక్రమించిన భూమిని కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని. ఆక్రమణదారుల నుంచి తమ భూమిని కాపాడాలని బాధితులు అధికారులను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికుమార్ వద్ద పట్టణానికి చెందిన పూజారి అలియాస్ బోయ కామయ్య కుటుంబీకులు గురువారం విన్నవించారు. సర్వే నంబర్ 372-2ఏ-1ఏలో 54 ఎకరాలు ఉండగా అందులో తమ తాత కామయ్య పేరున 3.70 ఎకరాలు ఉందన్నారు. కామయ్యకు ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా వారి సంతానం ప్రస్తుతం 46 మందికి పైగా ఉన్నామన్నారు. వీరంతా ఇదే సర్వే నంబర్లో ఉంటున్నామన్నారు. ఇటీవల పట్టణానికి చెందిన టీపీ సురేష్ అనే వ్యక్తి ఆ భూమిలో పట్టాలు చేయించుకుని తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కల్పించి భూములను కాపాడాలని వారు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో పూజారి గోపి, నాగరాజు, ప్రసాద్, మల్లికార్జునలతో పాటు కుటుంబీకులు పాల్గొన్నారు.

### హోంగార్డుకు ఆర్థిక చేయూత


నగదు అందజేస్తున్న తోటి హోంగార్డులు

**కళ్యాణదుర్గం:** పట్టణ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సరస్వతి అనారోగ్యంతో స్థానిక ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న 2004 బ్యాచ్ హోంగార్డులు గురువారం సరస్వతిని పరామర్శించారు. తమవంతుగా రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాము, హోంగార్డులు ప్రభావతి, ఇంద్రమ్మ, పార్వతి, మదర్ బీ, షేక్షావలి, షాకీర్, తాతప్ప, లక్ష్మన్న, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

### స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

**రాప్తాడురూరల్:** విధులను నిర్లక్ష్యం చేసిన బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లి జెడ్పీహెచ్ఎస్ గణితం స్కూల్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈఓ సాయిరామ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఆయన డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఉన్నారు. రెండు రోజుల కిందట జిల్లా కేంద్రం నుంచి ప్రశ్నపత్రాలు, ఇతర కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ పోలీస్‌స్టేషన్లకు పంపారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్ట్‌మెంటల్ అధికారి దగ్గరుండి ఈ మెటీరియల్‌ను రిసీవ్ చేసుకోవాల్సి ఉంది. అయితే శ్రీనివాసరెడ్డి మాత్రం ఆ సమయంలో పోలీస్‌స్టేషన్ వద్దకు రాలేదు. చీఫ్ సూపరింటెండెంట్ అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు తప్ప విధులకు హాజరుకాలేదు. దీనిపై డీఈఓ సాయిరామ్‌కు సీఎస్ ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన డీఈఓ సదరు టీచర్‌పై సస్పెండ్ వేటు వేశారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన

**బొమ్మనహాళ్:** మండలంలోని కొలగానహళ్లిలో వైద్యాధికారులు గీతాభార్గవి, కుమార రాజా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో రెండు రోజులుగా వివిధ జబ్బులతో గ్రామస్తులు బాధపడుతున్నట్లు సమాచారం రావడంతో జిల్లా మలేరియా అధికారి ఓబులు, ఉప అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ తిరుపాల్ నాయక్, సూపర్‌వైజర్ ఉమాదేవి తదితరులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం తాగునీటి క్లోరినేషన్, పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, నాగరత్నమ్మ, బాలాజీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### పిడుగు పాటుకు మిద్దె ధ్వంసం

**కంబదూరు:** మండలంలోని గుద్దెళ్ల గ్రామానికి చెందిన తిమ్మరాయుడు ఇంటిపై పిడుగు పడడంతో పైకప్పు ధ్వంసమైంది.

బుధవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు పడి ఇంటి పైకప్పు రెండు చోట్ల రంధ్రాలు పడడంతో పాటు ఇంట్లోనిఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయని బాధితుడు వాపోయాడు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

### నేడు వలంటీర్లకు సన్మాన సభ

**ఉరవకొండ:** స్థానిక లత్తవరం రోడ్డులోని తొగట వీర క్షత్రియ కల్యాణ మండపంలో వలంటర్లలకు సన్మాన సభ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ఉరవకొండ రూరల్ పరిధిలోని సచివాలయాల పరిధిలో పనిచేసే వలంటర్లను సన్మానిస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఉరవకొండ పట్టణ పరిధిలోని వలంటర్లను సత్కరిస్తామన్నారు. సభకు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

### కౌన్సెలింగ్‌కు 42 మంది హాజరు

**కళ్యాణదుర్గం:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగిన పాలిసెట్-2023 కౌన్సెలింగ్‌లో 42 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ వైఎస్ శ్రీధర్‌కుమార్ తెలిపారు. 43,001 నుంచి 58,000 ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ జరిగిందన్నారు. శుక్రవారం 58,001 నుంచి 74,000 ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

### దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

**కుందుర్పి:** మండల కేంద్రంలోని కృష్ణమ్మ గుట్ట వద్ద దివ్యాంగులకు కేటాయించిన 10 సెంట్ల స్థలాన్ని స్వాధీనం చేయాలని కోరుతూ గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట దివ్యాంగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. 2015లోనే కృష్ణమ్మ గుట్ట వద్ద మండల వికాలాంగుల సమాఖ్యకు 10సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ పట్టా సైతం ఇచ్చారన్నారు. ఇప్పటి వరకూ ఆ స్థలం చూపకపోగా కొందరు ప్రైవేటు వ్యక్తులు అడ్డుపడుతున్నారన్నారు.అనంతరం స్థలం చూపాలని కోరుతూ తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జాతీయ వికలాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు వసంత, దివ్యాంగులు వెంకటేష్, దేవరాజు, భీమరాజు, శివానంద పాల్గొన్నారు.

### తక్షణసాయం పంపిణీ

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని 21వ వార్డులో బుధవారం రాత్రి అనారోగ్యంతో వడ్డే కృష్ణ(46) మృతి చెందగా వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ నగదు సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు గురువారం కౌన్సిలర్ డిష్ గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్ అందజేశారు. మిగతా రూ.90 వేలు నామినీ ఖాతాకు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, కౌన్సిలర్లు ఫకృద్దీన్ పెద్ద వన్నూరుస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు పవన్‌కుమార్, గంగాధర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### రేషన్ దుకాణం తనిఖీ


సరుకులను పరిశీలిస్తున్న ఆర్డీఓ నిశాంత్ రెడ్డి

**కళ్యాణదుర్గం:** మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్దిలో ఉన్న రేషన్ దుకాణం -52ను ఆర్డీఓ నిశాంత్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణంలో కార్డు దారుల సంఖ్య...? బియ్యం సరఫరా...స్టాకు తదితర విషయాలపై ఆరా తీశారు. రేషన్ డీలర్ల పనితీరు, బియ్యం పంపిణీపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణదారులు సరుకులు సక్రమంగా అందించాలన్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికుమార్, వినియోగదారులు పాల్గొన్నారు.

### శ్రీవారి సేవలో ఎమ్మెల్సీ


ఆలయం వెలుపల ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులు

**ఉరవకొండ:** తిరుమల వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనం ద్వారా ఎమ్మెల్సీతో పాటు ఆయన సతీమణి ఉమాదేవి, కుటుంబ సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులకు అధికారులు తీర్థప్రసాదాలు అందించారు.

### సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు

**కుందుర్పి:** నిజవల్లి గ్రామ సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంపై గురువారం కలెక్టర్ గౌతమికి సర్పంచ్ ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ విధులకు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. హాజరైనా సచివాలయానికి వచ్చే ప్రజలకు నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారన్నారు. త్వరలోనే వారిని విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారన్నారు.